పరమభాగవతోత్తముఁడు. ఈయన భక్తియంతయు దేవీపరమై యున్నది. దేవీభాగవతము నాంధ్రీకరించినవారిలో నీయనయే ప్రాథముఁడు. వేంకటాద్రి ప్రభువు గతించినపిదప గొంతకాలమునకు తన వార్ధకదశయందు నొకకుమారుఁడు సంస్కృతభాగవతమును జదువుచుండఁ దా నొక బాలీసు నానుకొని వినుచు, నాశుధోరణి మఱియొక కుమారునకు నాంధ్రీకరణమును జెప్పి వ్రాయించి యారుమాసములలో సంపూర్తి నొనరించెను. ఈయనరచించిన భాగవతమునం దెల్లయెడల భక్తిరసము వెల్లివిరిసి యుండును. పాపయారాధ్యులు తానొకనాఁడు చాముండీశ్వర్యాలయమునకుఁ బ్రదోషకాలమున దర్శనార్థమై పోవునప్పటికి నందలి యర్చకుఁడు తలుపులుమూసి పోయియుండెను. ఆ సమయమందు భక్త్యావేశముతో—

"ముక్తిద్వారము తల్పుదీయఁగదె చాముండా! జగజ్జననీ"
యనెడు మకుటముతో నిరువదేడు పద్యము లాశుధోరణిఁ జెప్పునప్పటికా జగదీశ్వరికిఁ గరుణగల్గి తలుపులు తెరచెనని చెప్పుదురు. ఆ పద్యములలో నొకటిమాత్రము నిటఁ జూపుచున్నాను.

శా. ముక్తాపాండుర హాసచంద్రికలు కెమ్మోవిం గుబాళింప మా
దృక్తాపత్రయి విన్నవించి పతితోఁ జేమంబుట్టించి ప్రా
గుక్తాళిచరణాంగదారవ సముద్ద్యోతాంగివై వచ్చి నీ
ముక్తిద్వారము తల్పుతీయఁగదె చాముండా! జగజ్జననీ!

పాపయారాధ్యుని గ్రంథములు ముద్రణాదిసాధన సంపత్తి లేక ప్రచ్ఛన్నములై యుండుటను బట్టి లోకమంతగా నీతని కవిత్వము నెఱిఁగియుండదు. కావున నీతని కవిత్వమును గుఱించి యించుక ముచ్చటించి విడిచెదను. పాపయారాధ్యులు కవిజనసామాన్యుఁడు గాక నిరుపమాన పాండితీవైభవోపేంద్రుఁడు. ఈతనికవిత్వమును విమర్శించి చూచిన నీతనికి నాంధ్ర మనిన నొకలక్ష్యములో నుండినట్టు గాన్పింపదు. ఇంతమాత్రమున నీతని యాంధ్రకవిత్వమున కేమైన కొరత యుండెనా? కేవల మాంధ్రమందు గూడ నొకకావ్యమును రచియించెను. కావున నుభయభాషా కవిత్వవిశారదుఁడగు నిమ్మహాకవి కవిత్వ మసర్గళగంగాలహరివలె నిరాఘాటమై లలితమృదుపద భూయిష్ఠమై సర్వాలంకారాలంకృతమై చదువఁజదువఁ జవులుగొల్పుచు మనోహరమై యుండును. ఈతని కవిత్వమునుండి యుదాహరణార్థము దిక్మాత్రముగాఁ గొన్ని పద్యముల నిం దుదాహరించియే యున్నాను. ఆపద్యములను బట్టి ఈతఁ డసమానవ్యాకరణ విద్వాంసుఁడని స్పష్టపడకమానదు.

# పంచముల విజ్ఞప్తి

గొల్లపల్లి సామ్యూల్ గారు

సంఘసంస్కర్తలై జనుల మా మమ్ముల
  నాదరింపనిచో నిఁక లేది దిక్కు?
పరమ భక్తులవలె దిరుగువారెల్లరు
  మముఁజూడకున్నను మార్గమేది?
వసుధ మహామహోపాధ్యాయులే మమ్ము
  నిరసింప నిఁక వేఱు తెలుఁగదెద్ది?
మాచాకిరీలేక కొంచెమున్నగని
  వారె పీడఁగ మాకు దారియెద్ది?
గీ. కుడుపునొందిన గొమ్మపై గ్రుడ్డ నగునె?
తరుణఫలములఁ దినిచెట్టు నఱుక నగునె?
తీసికొనిపాలు పొదుగు ఖేదించ నగునె?
ఏలనయ్య! యిట్టిచేత - లిద్ధరిత్రి.
సీ. ఊరికి దవ్వుల నుంచిన మాత్రాన
  బోయెనే? మీదు యనూయకొంత.
ముట్టరాదనిపట్టు పట్టిన మాత్రాన
  పమసెనే? మీదు ద్వేషంబుకొంత
పెద్దకులంబని పీకులాడినయంత
  జనియెనే? మీదగు కినుక కొంత
అంటరాదని చాల - యార్భాట మొనరింప
  మ్రందెనే? మీదు రా - ద్రంబుకొంత.
గీ. తగ్గెనని మీర లొకవేళ దలచియున్న
నెప్పుడే? మాకు మీపైని యున్నొకట్లు.
ద్వేషబుద్ధి ద్వేషంబునే పెంచుగాని
యైకమత్యంబు గూర్ప స హాయపడునె?

సీ. అంగళ్ల వస్తువు లమ్మి బ్రదుకుటకైన
  నంటరాని తనంబె - యడ్డుదగులు
గొప్పవారలయొద్దఁ గొలువు సేయుటకైన
  నంటరాని తనంబె యడ్డుదగులు
బంట్రౌతు పనిచేసి - బ్రతుకుద మనుకొన్న
  నంటరాని తనంబె యడ్డుదగులు
గృహకృత్యము లొనర్చి మహిఁ బ్రతుకుద మన్న
  నంటరాని తనంబె యడ్డుదగులు
ఇచ్చవచ్చిన చోటి - కేగుద మనుకొన్న
  నంటరాని తనంబె - యడ్డుదగులు
గీ. వసుధ నెల్లైన జీవనో - పాధిసేయ
నంటరాని తనంబె మా కడ్డుదగులు
ఎందుబోదుము? గతియేమి? యెవరు బ్రోతు?
రకట మాకర్మ మిటులయ్యె నవనియందు.
సీ. స్వపరి పాలనకునై పరిపాలకుల తోడ
  వాదించు జాతీయ వాదులార!
ప్రజల హక్కులకునై ప్రభువుల సభలోన
  వాదమాడెడు నతి వాదులార!
స్వేచ్ఛ నొసఁగు డంచు బ్రిటిషు వారల తోడ
  వాద మాడెడు మిత వాదులార!
పై వారితోఁబాటు ప్రక్కతాళము వేసి
  వాదులాడెడు ప్రజా ప్రముఖులార
గీ. దిగవిడిచి మమ్ము నిట్లు సం - దిగ్ధ గతిని
హక్కులన్నియు మీరలే - యందు వార
లేమి చేయంగ మమ్ముల - నెంచి నారు?
విశదముగ జెప్పరే మాకు - విబుధులార.